జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం | 27 | ఏప్రిల్ | 2026 ◆ పేజీలు : 7



# భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న ఖమ్మం పోలీసు కమీషనర్



**భద్రాచలం, ఏప్రిల్ 26, ప్రజా జ్యోతి:** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని ఆదివారం ఖమ్మం పోలీసు కమీషనర్ సునీల్‌దత్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం సునీల్‌దత్‌కు వేద ఆశీర్వచనంతో పాటు తీర్థ ప్రసాదాలను దేవస్థానం ఏఈవో శ్రావణ్‌కుమార్ అందజేశారు. ఆయన వెంట భద్రాచలం సీఐ నాగరాజు, ట్రాఫిక్ ఎస్సై తిరుపతి, ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబా పాల్గొన్నారు.



# పాల్వంచలో పెరుగుతున్న... ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్స్

4 లో..

- యువత భవిష్యత్తుతో ఆడుకుంటున్న ఆన్‌లైన్ మాయాజాలం
- పాల్వంచ పట్టణ కేంద్రంగా మారుతున్న బెట్టింగ్ వ్యవస్థ
- ఆందోళనలో తల్లిదండ్రులు

ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభమైతే చాలు, దేశవ్యాప్తంగా క్రికెట్ అభిమానుల్లో ఉత్సాహం నెలకొంటుంది. అయితే అదే ఐపీఎల్ ఇప్పుడు యువత జీవితాలను ప్రమాదంలోకి నెట్టేస్తోందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణ కేంద్రంలో క్రికెట్ బెట్టింగ్స్ జోరుగా సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యవస్థ నడుస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● పాల్వంచ, ప్రజాజ్యోతి

# భద్రాచల రామాలయంలో నేత్రపర్వంగా కళావాహన కార్యక్రమం



- ఆలయ జీర్ణోద్ధరణ పనులకు వైభవంగా అనుజ్ఞ
- చిన్నజీయర్ స్వామి పర్యవేక్షణలో ప్రత్యేక వైదిక క్రతువులు
- 72 దేవతామూర్తులకు ఏకకాలంలో కళావాహనం
- బాలాలయానికి తరలింపు ప్రారంభం

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 26 (ప్రజాజ్యోతి ):** దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచల శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో ఆలయ జీర్ణోద్ధరణ మరియు విస్తరణ పనులకు సంబంధించిన కళావాహన కార్యక్రమం ఆదివారం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల మధ్య నేత్రపర్వంగా నిర్వహించారు. శతాబ్దాల చరిత్ర కలిగిన భద్రాద్రి రామాలయ చరిత్రలో తొలిసారిగా 72 దేవతామూర్తులకు ఏకకాలంలో కళావాహనం నిర్వహించడం విశేషంగా నిలిచింది. ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం మూలమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పవిత్ర గోదావరి నది నుంచి

మిగతా 2 లో...

# వైద్యశాలలపై కఠిన పర్యవేక్షణ: ఎమ్మెల్యే హెచ్చరిక



**కొత్తగూడెం, ఏప్రిల్ 26 ( ప్రజాజ్యోతి )** వైద్యశాలల్లో నిర్లక్ష్యం అస్సలు సహించబోమని అవసరమైతే సంబంధిత అధికారులపై చర్యలకు సిఫారసు చేస్తానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ

మిగతా 2 లో...



2 లో..

# బతుకుదెరువు పై... మండుటెండ!

- వేసవిలో వీధి వ్యాపారులకు తప్పని తిప్పలు
- జీవన పోరాటంలో ఎదురీత -అధిక ఉష్ణోగ్రతలతో తగ్గిన వీధి వ్యాపారం
- ఒక్కొక్కరిదీ ఒక్కో గాథ... ఎవరికి పట్టని వ్యధ

## వైద్యశాలలపై కఠిన పర్యవేక్షణ: ఎమ్మెల్యే హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి...)

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎక్కడా మందుల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సామాన్యులు నమ్మకంతో ఆసుపత్రులకు వస్తారని అందుబాటులో ఉన్న వనరులతోనే నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను బలోపేతం చేయాలని మారుమూల గ్రామాల్లో వైద్య శిబిరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేస్తూ ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఆసుపత్రుల్లో ఖాళీ పోస్టులు, అవసరమైన పరికరాలు, మందుల నిల్వలపై వెంటనే సమగ్ర నివేదిక ఇవ్వాలని కోరారు. వైద్యులు, సిబ్బంది బాధ్యతతో పనిచేస్తేనే పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై అత్యాచారయత్నం?

- -దేహశుద్ధి చేసిన స్థానికులు?
- -రాజీ కుదిర్చినట్లు సమాచారం



**ఇల్లందు, ఏప్రిల్ 26, ప్రజాజ్యోతి:** ఇల్లందు పట్టణంలోని కొత్త కాలనీలో శనివారం అర్ధరాత్రి ఓ మైనర్ బాలికపై ఇరువురు యువకులు అత్యాచారయత్నం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొత్త కాలనీలోని పార్కు వద్ద మైనర్ బాలికపై అత్యాచారయత్నం చేసినట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది. ఈ ఘటన బయటికి పొక్కకుండా ఉండేందుకు కొందరు రాజీ కుదిర్చినట్లు సమాచారం. కాగా ఆ ఇరువురి యువకులకు దేహశుద్ధి చేసినట్లు తెలుస్తుంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుత సమాజంలో యువత మద్యం, గంజాయికి బానిసలై మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు స్పష్టమవుతుంది. కొత్త కాలనీలో బెల్టు షాపులు అధికంగా ఉండడంతోపాటు పార్కులో నిత్యం యువకులు గంజాయిని సేవిస్తూ పురుషులపైకి ఘర్షణలకు వెళ్లడం జరుగుతుందని ఆ ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. ఇక మహిళలు ఆ రోడ్డు మార్గం ద్వారా వెళ్లే పరిస్థితి లేదని, సంబంధిత శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



# బతుకుదెరువు పై... మండుటెండ!

- వేసవిలో వీధి వ్యాపారులకు తప్పని తిప్పలు
- జీవన పోరాటంలో ఎదురీత -అధిక ఉష్ణోగ్రతలతో తగ్గిన వీధి వ్యాపారం
- ఒక్కొక్కరిదీ ఒక్కో గాధ... ఎవరికి పట్టని వ్యధ

**మండుటెండల్లో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇంట్లో కూర్చుంటే పనులు జరగవు. పనులు జరగకపోతే జీవనం కొనసాగదు. బయటికి వెళ్తే ప్రాణాలు తీసే ఎండ. జీవన పోరాటంలో ఎదురీత అలవాటైపోయింది. మండువేసవిలో వీధి వ్యాపారుల అవస్థలపై "ప్రజాజ్యోతి" ప్రత్యేక కథనం...**

**- ఇల్లందు, ప్రజాజ్యోతి**

చిరువ్యాపారుల్లో అల్పాదాయ వర్గాల నుండి వచ్చిన మహిళలు, వృద్ధుల సంఖ్యే ఎక్కువ. ఒక్కొక్కరిదీ ఒక్కో గాధ.. చెప్పుకోలేని వ్యధ.. బిడ్డలు సక్రమంగా చూడడం లేదని, బతుకుదెరువు కోసం వ్యాపారం చేస్తున్న వారు కొందరైతే.. శరీరం కదిలినంత సేపు ఒకరి మీద ఆధారపడి బతకడం ఎందుకంటూ ఆత్మాభిమానంతో వ్యాపారాలు చేసుకుంటున్న వృద్ధులను చూస్తే ఆశ్చర్యం కలుగక మానదు. ప్రభుత్వాలు ఎన్ని మారుతున్నా.. వారి పరిస్థితుల్లో ఎలాంటి మార్పు లేదు.. అయినా బతుకు పోరాటం కోసం ఉదయం 9 గంటలనుండి రాత్రి 9 గంటల వరకు 12 గంటల సేపు నిర్విరామంగా వారు వ్యాపారం చేస్తున్నారు. వారిలో ప్రధానంగా పూలు, పండ్లు, కూరగాయలు అమ్మే వారే అధికం. మార్కెట్ కు వెళ్లడం, అవసరమైన సరుకులను కొనుగోలు చేసి చిన్న బుట్టల్లో తెచ్చుకొని రహదారుల వెంబడి తోపుడుబండ్ల మీద వ్యాపారం చేసుకుంటారు. వృద్ధాప్యంలో కూడా బతుకుదెరువు కోసం మండుటెండలో వ్యాపారం చేయాల్సిన పరిస్థితి పగవాడికి కూడా రాకూడదంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ లో రూ.100తో కొన్న సరుకును అతి తక్కువ ధరకే తాము అమ్ముకుంటున్నామన్నారు. ఎంతో ఉన్నత విద్య చదివిన వారు షాపింగ్ మాల్స్ లో వారు చెప్పినంత ధరకే కొనుగోలు చేస్తారు.మా దగ్గర మాత్రం గిలిగిచి బేరమాడడమే తమకు ఆశ్చర్యం తోపాటు బాధ కలిగిస్తుందని ఆవేదన చెందుతుంటారు. వీధి వ్యాపారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని ప్రకటనల్లో చూడడమే కానీ తమ దాకా చేరలేదని వారు చెబుతున్నారు. అధికార యంత్రాంగం ప్రత్యేకంగా సర్వే చేసి వారికి ఉపయోగపడేలా వయస్సుతో నిమిత్తం లేకుండా పథకాల రూపకల్పన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వాలు మారినా తమ తలరాత మారలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిలిగిచి బేరమాడకుండా మానవతా దృక్పథంతో కొనుగోళ్లు చేస్తే చాలని వారు ప్రత్యేకంగా సహాయమంటూ ఏదీ చేయనక్కరలేదని పలువురు వృద్ధ చిరు వ్యాపారులు చెబుతుండడం వారి ఆత్మాభిమానానికి చక్కటి నిదర్శనమనే చెప్పొచ్చు.

# భద్రాచల రామాలయంలో నేత్రపర్వంగా కళావాహన కార్యక్రమం







(మొదటి పేజీ తరువాయి...)

సంప్రదాయబద్ధంగా 30 తీర్థ బిందెలలో జలాలను తీసుకువచ్చి ఆలయ ప్రాంగణానికి చేర్చారు. అనంతరం ఆలయం పరిసర ప్రాంతాల్లోని 15 ఉప ఆలయాలతో పాటు ఉత్తర, దక్షిణ, తూర్పు గోపురాల వద్ద ప్రత్యేక హోమ గుండాలను ఏర్పాటు చేసి వైదిక బృందం జీర్ణోద్ధరణకు అనుజ్ఞ కార్యక్రమాలు నిర్వహించింది.

### »» చిన్నజీయర్ స్వామి పర్యవేక్షణలో వైదిక క్రతువులు

ఈ మహోత్సవ కార్యక్రమం త్రిదండి చిన్నజీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో అత్యంత వైభవంగా సాగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహవచనం, ప్రత్యేక హోమాలు, స్నపన తిరుమంజనం వంటి పూజా కార్యక్రమాలు వైదిక మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించారు. లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయం సహా చుట్టుపక్కల ఉప ఆలయాల్లో ప్రత్యేక హారతులు సమర్పించారు.

### »» 72 దేవతామూర్తులకు కళావాహనం

ఆలయ విస్తరణ పనుల్లో భాగంగా చుట్టూ ఉన్న ఉప ఆలయాలను తొలగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో ఆయా ఆలయాల్లోని 72 దేవతామూర్తులకు ఏకకాలంలో కళావాహనం నిర్వహించి, సంప్రదాయబద్ధంగా బాలాలయాలకు తరలించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రధాన ఆలయ పరిసరాల్లోని లక్ష్మీ తాయారు, గోదాదేవి అమ్మవారి దేవతామూర్తులను ప్రత్యేక వేదికలపై భద్రపరిచి నిత్యపూజలు నిర్వహించనున్నారు. అలాగే 15 ఉప ఆలయాల్లోని దేవతామూర్తులను రంగనాయకుల గుట్టపై నూతనంగా నిర్మించిన జ్ఞాన మందిరంలోని బాలాలయానికి తరలిస్తున్నారు.

### »» 70 మంది వేద పండితులతో ఘనంగా పూజలు

యాదాద్రి, సింహాచలం, ధర్మపురి తదితర ప్రసిద్ధ క్షేత్రాల నుంచి విచ్చేసిన పాంచరాత్రాగమ పండితులు, 70 మంది వేద రుత్వికులు సంప్రదాయబద్ధంగా జీర్ణోద్ధరణ అనుజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. వేదఘోషలు, మంగళవాయిద్యాల మధ్య దేవతామూర్తులను బాలాలయానికి తరలించే కార్యక్రమం భక్తులను ఆధ్యాత్మిక పరవశానికి గురిచేసింది.

### »» దర్శనాలు తాత్కాలికంగా నిలిపివేత

కళావాహన కార్యక్రమం కొనసాగుతున్న నేపథ్యంలో భక్తుల దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేశారు. అయితే ఆలయ అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

### »» రూ.586 కోట్లతో రామాలయ అభివృద్ధి

భద్రాద్రి రామాలయ సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ.586 కోట్లు మంజూరు చేసింది. ఇందులో తొలి విడతగా రూ.351 కోట్లతో ఆలయ విస్తరణ, ఆధునికీకరణ పనులు ప్రారంభమయ్యాయి. గోదావరి స్నాన ఘట్టాల అభివృద్ధి, యాత్రికుల సౌకర్యాలు, విశాల ప్రాకారాలు, క్యూ లైన్లు, మాడ వీధుల విస్తరణ, పార్కింగ్ సదుపాయాలు, ఆధ్యాత్మిక కేంద్రాల నిర్మాణం చేపట్టనున్నారు.

### »» దక్షిణ అయోధ్యకు మరింత వైభవం

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం తెలంగాణలోనే కాక దేశవ్యాప్తంగా అత్యంత ప్రసిద్ధి చెందిన వైష్ణవ క్షేత్రంగా గుర్తింపు పొందింది. భక్త రామదాసు నిర్మించిన ఈ ఆలయం ప్రతి సంవత్సరం జరిగే శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంతో ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. ఇప్పుడు చేపడుతున్న జీర్ణోద్ధరణ, విస్తరణ పనులతో భద్రాద్రి క్షేత్రానికి మరింత వైభవం చేకూరనుంది.

ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, దేవస్థానం ఏఈవో శ్రావణ్ కుమార్, ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, కత్తి శ్రీనివాస్, వైదిక బృందం, అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా బ్రహ్మంగారి 333వ ఆరాధన మహోత్సవాలు

**టేకులపల్లి,ఏప్రిల్ 26,ప్రజా జ్యోతి:** భక్తి భావంతో నిండిన ఆధ్యాత్మిక వాతావరణంలో టేకులపల్లి మండల కేంద్రంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయంలో వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా జగద్గురు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 333వ ఆరాధన మహోత్సవాలు ఆదివారం అత్యంత ఘనంగా ఆలయ కమిటీ వారు నిర్వహించారు. గ్రామం అంతా పండుగ వాతావరణంలో మునిగిపోయి, భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి వీరబ్రహ్మేంద్రస్వామి వారిని దర్శించుకున్నారు.ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభించారు. ఆలయ ప్రాంగణం మంగళ తోరణాలతో సుందరంగా అలంకరించబడింది. జెండా ఊరేగింపు భక్తుల మధ్య భక్తి ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. శ్రీ గోవింద మాంబా సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారికి నవనీత





అభిషేకాలు ఘనంగా అర్చకులు వేద మంత్రాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.అలంకరణలతో స్వామివారు అద్భుతంగా దర్శనమిచ్చారు. మహా నివేదన, మహా మంత్రపుష్పం, మంగళ నీరాజనం కార్యక్రమాలు భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తాయి. అనంతరం పల్లకి సేవను ఘనంగా నిర్వహించి,గ్రామలోని పురవీధులలో స్వామివారి ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు బ్రహ్మంగారి నామస్మరణతో భక్తి పరవశంలో తేలిపోయారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేయగా, పెద్ద సంఖ్యలో భక్తులు స్వీకరించారు. మధ్యాహ్నం నుండి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన మహోత్సవం నిర్వహించబడింది.వేలాదిగా తరలి వచ్చిన భక్తులకు అన్న వితరణ కార్యక్రమం చేశారు. ఈ మహోత్సవాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో టేకులపల్లి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయం భక్తి శోభతో కళకళలాడింది.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు తౌడోజు భిక్షమయ్య, ధర్మపురి శ్రీనివాసచారి, గజ్జెల రాంశేఖర్, నోముల భాస్కరాచారి, చంద్రగిరి రాధాకృష్ణ, చిలకమర్రి రామకృష్ణ, ధర్మపురి జనార్ధన చారి, అన్నారపు వెంకటేశ్వర్లు, ధర్మపురి వీర బ్రహ్మచారి,కటుకోజ్వాల సురేష్, భౌరోజు బిక్షమయ్య, కటుకోజ్వల సురేష్ , బొడ్డుపల్లి బ్రహ్మచారి, నోముల కళావతి, ఆకారపు స్వప్న, ఉరిమెల్ల యాదాచారి , వజ్రాల పరిపూర్ణ చారి, పర్వతం ఉపేంద్ర చారి, తౌడోజు మణికంఠ, తౌడోజు టీంకు, అనుగోజు నటరాజ్, టేకులపల్లి విశ్వబ్రాహ్మణులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామచంద్రుడు తన ఆలయాన్ని మరింత అందంగా నిర్మించుకుంటున్నారు

- భద్రాద్రిలో గోదావరి పుష్కరాల నాటికి భవ్య రామ మందిరం పూర్తి
- త్రిదండి చినజీయర్‌స్వామి వెల్లడి



**భద్రాచలం, ఏప్రిల్ 26, ప్రజా జ్యోతి:** 2027 సంవత్సరం జూలైలో జరిగే గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలంలో భవ్య రామ మందిరం రామ భక్తులకు అందుబాటులోకి వస్తుందని త్రిదండి చినజీయర్‌స్వామి వెల్లడించారు. ఆదివారం భద్రాచలంలోని రామాలయంలో జరిగిన కళావాహన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. సత్యానికి, ధర్మానికి ప్రతిరూపుడైన భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి వారు తన ఆలయాన్ని నూతనంగా నిర్మించుకుంటున్నారని, ఈ రోజున జీర్ణోద్ధరణ జరగగా, నూతన ఆలయం పుష్కరాల సమయం వరకు సిద్ధమవుతుందని అన్నారు. ప్రధాన ఆలయం మినహా చుట్టు ఆలయాలకు, అమ్మవారి ఆలయం జీర్ణోద్ధరణకు అనుజ్ఞ తీసుకోవడం జరిగిందని తెలిపారు. రాతి శిలలతో నూతన నిర్మాణాలు ఉండనున్నాయని, ప్రజలకు పూర్తి సౌకర్యవంతంగా ఉండేలా ఆలయాన్ని పునర్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. నూతన ఆలయంలో చుట్టు ఆలయాల సన్నిధిలో ఎవరున్నారనేది భక్తులకు అర్ధమయ్యే ఆళ్వారులు, ఆచార్యులను ఉంచడం జరుగుతుందన్నారు. ఆలయ నిర్మాణ పనుల సమయంలో భక్తులు సహకరించాలని, శ్రీరామచంద్రస్వామి దివ్యమూర్తుల దయ ఎల్లప్పుడు మనపై ఉంటుందన్నారు. వారి ఆలయాన్ని తీర్చిదిద్దుకునే అరుదైన ఘట్టాన్ని మనం ఇప్పుడు చూడబోతున్నామని, భవిష్యత్తులో భవ్య రామాలయం మన కళ్ల ముందు సాక్షాత్కరం కానుందన్నారు.

## ముర్ల యర్రయ్య రెడ్డి ఆశయ సాధనే మన లక్ష్యం

- మాజీ ఎమ్మెల్యే 28వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు
- వృద్ధాశ్రమంలో అన్నదానం, నిత్యావసరాల పంపిణీ





**భద్రాచలం టౌన్ ఏప్రిల్ 26 ప్రజాజ్యోతి** భద్రాచలం మాజీ శాసనసభ్యులు, అమరజీవి ముర్ల యర్రయ్య రెడ్డి 28వ వర్ధంతి వేడుకలను ఆదివారం భద్రాచలంలో ఘనంగా నిర్వహించారు. భద్రాచలం మానవసేవ ఆర్గనైజేషన్ (వృద్ధాశ్రమం ) నందు యర్రయ్య రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించి, నిత్యావసర సరకులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆదివాసీ కొండరెడ్ల సంఘం వ్యవస్థాపక గౌరవ అధ్యక్షులు ముర్ల రమేష్ మాట్లాడుతూ.. ఉమ్మడి భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధిలో యర్రయ్య రెడ్డి పోషించిన పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, ఆదివాసీల హక్కులు మరియు చట్టాల పరిరక్షణకు ఆయన అహర్నిశలు కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. రాజకీయాల్లో ఉన్నా కూడా నిస్వార్థంగా, నిరాడంబరంగా జీవించిన గొప్ప నాయకుడని, ఆయన ఆశయ సాధనలో భాగంగానే నేడు ఈ సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గర్నెపల్లి అశోక్, గుంటి రాజేష్, సొంది రవికుమార్, ముదిగొండ సత్యనారాయణ, ఎల్లంకి వినోద్ మరియు తదితరులు పాల్గొని యర్రయ్య రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## భద్రాచలంలో 'హిందూ సమ్మేళనం' పోస్టర్ ఆవిష్కరణ

- మే 3న జూనియర్ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ
- ఏర్పాట్లు వేగవంతం చేసిన ఉత్సవ కమిటీ





**భద్రాచలం టౌన్ , ఏప్రిల్ 26 , ప్రజాజ్యోతి,** పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో వచ్చే నెల మే 3వ తేదీ ఆదివారం నిర్వహించనున్న 'హిందూ సమ్మేళనం' కార్యక్రమానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో జరగనున్న ఈ మహా సమ్మేళనానికి సంబంధించిన అధికారిక పోస్టర్ ను ఆదివారం కాకతీయ గ్రాండ్ హోటల్ లో నిర్వహించిన ముఖ్య సమన్వయ సమావేశంలో ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా హిందూ సమ్మేళనం ఉత్సవ కమిటీ అధ్యక్షులు, కార్యక్రమ నిర్వాహకులు పాకాల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. హిందూ ధర్మ రక్షణ, సమాజంలో ఐక్యతను పెంపొందించడమే ఈ సమ్మేళనం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ఇప్పటికే పలు దఫాలుగా సమావేశాలు నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించామని, పోస్టర్ విడుదలతో ప్రచార కార్యక్రమాలను గ్రామ గ్రామాన మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ ధర్మ మహా సమ్మేళనాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా తరలివచ్చి భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ప్రముఖులు డాక్టర్ కృష్ణచైతన్య, శివనాగస్వామి, కుంజా ధర్మ, నాగభూషణ శాస్త్రి, గోపి, ఎం.వి. సుబ్రహ్మణ్యం, శ్రీధర్ జీతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ హిందూ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమ్మేళనం విజయవంతం కోసం అందరూ సమన్వయంతో ముందుకు సాగాలని సమావేశం నిర్ణయించింది.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి సీఐ తిరుపతి




**గుండాల. మార్చి. 26 ప్రజా జ్యోతి** సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కుండాల సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీపతి తిరుపతి అన్నారు మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ప్రజలతో మాట్లాడారు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రజలకు పలు సూచనలు చేశారు . డిజిటల్ అరెస్ట్, యూపీఐ ఫ్రాడ్స్, క్యూ ఆర్ కోడ్ రాడ్స్, ఫేక్ ఐడి, ఫేక్ జాబ్స్ ఫ్రాడ్స్, ఫేక్ మర్చంట్ యాప్స్ పై అప్రమత్తంగా ఉండాలని కోరారు సైబర్ క్రైమ్స్ ఎలా జరుగుతాయో అవగాహన కల్పించారు సైబర్ నేరాలపై ఎప్పటికప్పుడు అవగాహన చేసుకుని జాగ్రత్తగా ఉండాలని కోరారు.

## ఐటీడీఏలో గిరిజన దర్బార్ తహసీల్దారు కార్యాలయంలో ప్రజావాణి

**భద్రాచలం, ఏప్రిల్ 26, ప్రజా జ్యోతి:** భద్రాచలం ఐటీడీఏ కార్యాయలంలో నేడు గిరిజన దర్బార్ నిర్వహించనున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో బి. రాహుల్ తెలిపారు. ఈ దర్బార్‌కు అన్ని శాఖల ఐటీడీఏ అధికారులు సకాలంలో హాజరుకావాలని తెలిపారు. గిరిజనులు వారి వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదును అందజేయాలని, సంబంధిత యూనిట్ అధికారులు సకాలంలో దర్బార్‌కు హాజరు కావాలని పీవో రాల్ కోరారు. అలాగే భద్రాచలం తహసీల్దారు కార్యాలయంలో ప్రజవాణి నిర్వహించనున్నట్లు తహసీల్దారు దనియాల వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంకు అన్ని శాఖల మండలస్థాయి అధికారులు హాజరవుతున్నందున ప్రజలందరూ తమ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను సకాలంలో అందజేయాలని వారు కోరారు.

# సీనియర్ ఉపాధ్యాయుడికి అన్యాయం

- జనాభా గణన సూపర్వైజర్ల నియామకంలో వివాదం



**టేకులపల్లి, ఏప్రిల్26, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (సోషల్)గా సేవలందిస్తున్న సీనియర్ ఉపాధ్యాయుడు గుగులోతు చందర్ సింగ్‌కు జనాభా గణన 2027 విధుల్లో తీవ్ర అన్యాయం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.నిబంధనల ప్రకారం సీనియారిటీ ప్రాతిపదనగా తనను సూపర్వైజర్‌గా నియమించినప్పటికీ,ఎంఈఓ (మండల విద్యాశాఖాధికారి ) ఏకపక్షంగా వ్యవహరించి తనను ఆ బాధ్యతల నుండి తొలగించారని ఆయన ఆరోపించారు. అత్యంత కీలకమైన జనాభా గణన ప్రక్రియలో అనుభవం ఉన్న తమ వంటి వారిని కాదని, నిబంధనలకు విరుద్ధంగా జూనియర్లను,సూపర్వైజర్లుగా నియమించడం వెనుక ఎంఈఓ నిర్లక్ష్యమా..? పక్షపాత ధోరణి స్పష్టంగా కనిపిస్తోందని చందర్ సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ నెల 27, 28, 29 తేదీల్లో జరగాల్సిన శిక్షణా తరగతులకు ముందే తనను విధులనుంచి తప్పించడంపై ఆయన తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. దేశ భవిష్యత్తును నిర్ణయించే సెన్సెస్ వంటి బాధ్యతాయుతమైన కార్యక్రమాల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులను అవమానించడం సరికాదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం వ్యక్తిగతగానే నాకు అన్యాయమే చేశాడు అని ఆయన ఆరోపించాడు. విద్యాశాఖ పరువును కూడా బజారున పడేస్తోందని ఆయన వాపోయారు. తన దయనీయ స్థితిని పరిగణనలోకి తీసుకుని, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఎంఈఓ వైఖరిపై విచారణ చేపట్టి తనకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది తిరిగి సూపర్వైజర్‌గా అవకాశం కల్పించాలని చందర్ సింగ్ డిమాండ్ చేశారు.

# వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి 333 సంవత్సరం ఆరాధనా మమహోత్సవం

- పూజల్లో పాల్గొన్న రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల





**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 26,(ప్రజా జ్యోతి)** పాల్వంచ మండలం పరిధి లోని లక్ష్మీదేవిపల్లి పంచాయతీ విరాట్ నగర్ లోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి 333 సంవత్సరము ఆరాధనా మమహోత్సవములను ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి బ్రహ్మశ్రీ పెద్దోజా నాగాచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజల్లో రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తోపాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.ప్రత్యేక పూజల్లో వీరబ్రహ్మేంద్రస్వామి పతాకావిష్కరణ, గణపతి పూజ, అభిషేకాలు, పల్లకీసేవ, మూలమంత్ర హోమకార్యక్రమము, సజీవ సమాధి ఘట్టం వంటి పూజలను పూజారి ఆరిందాల యస్వంత్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం వెయ్యిమంది భక్తులకు మహాప్రసాదం వితరణ చేశారు, అన్నదాన కార్యక్రమాన్ని కొత్వాల ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జాలె జానకిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న గౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షులు నాంపల్లి వేణుగోపాలాచారి, సెక్రటరీ మోత్కురి రవీంద్రాచారి, కోశాధికారి జుజ్జూరి ప్రభాకరాచారి, కాపర్తి వెంకటాచారి, బసవపాత్రుని తిరుపతి, కట్టుకోర్టుల సత్యనారాయణ, అక్కేనపల్లి వెంకటేశ్వర్లు, వద్దిపట్టి రాఘవాచారి, సీతారామాచారి, ధీగుట్ల వెంకటాచారి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.




## పాల్వంచలో పెరుగుతున్న...

# ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్స్

- యువత భవిష్యత్తుతో ఆడుకుంటున్న ఆన్‌లైన్ మాయాజాలం
- పాల్వంచ పట్టణ కేంద్రంగా మారుతున్న బెట్టింగ్ వ్యవస్థ
- ఆందోళనలో తల్లిదండ్రులు

**ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభమైతే చాలు, దేశవ్యాప్తంగా క్రికెట్ అభిమానుల్లో ఉత్సాహం నెలకొంటుంది. అయితే అదే ఐపీఎల్ ఇప్పుడు యువత జీవితాలను ప్రమాదంలోకి నెట్టేస్తోందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణ కేంద్రంలో క్రికెట్ బెట్టింగ్స్ జోరుగా సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యవస్థ నడుస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.**

- పాల్వంచ, ప్రజాజ్యోతి

### ››› మొబైల్ ఫోన్ చేతిలో, లక్షల రూపాయలు బెట్టింగ్ లో..

ఒకప్పుడు బెట్టింగ్ అంటే కొంత మంది రహస్యంగా నిర్వహించే వ్యవహారం.కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది.చేతిలో మొబైల్ ఫోన్ ఉంటే చాలు కొన్ని యాప్స్, టెలిగ్రామ్ గ్రూపులు, సోషల్ మీడియా లింకుల ద్వారా క్షణాల్లో బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. ఈ మ్యాచ్‌లో ఎవరు గెలుస్తారు.? ఎన్ని పరుగులు వస్తాయి.! ఏ ఆటగాడు సిక్స్ కొడతాడు అంటూ ప్రతి బంతికి డబ్బులు మారుతున్నాయి.

### ››› పాల్వంచలో యువత టార్గెట్

పాల్వంచ పట్టణంలోని కొంతమంది యువకులను లక్ష్యంగా చేసుకుని మధ్యవర్తులు బెట్టింగ్ యాప్స్‌కు అలవాటు చేస్తున్నారని సమాచారం. మొదట ఉచిత బోనస్‌లు, చిన్న మొత్తాల్లో లాభాలు చూపించి తర్వాత భారీ మొత్తాల్లో డబ్బులు పెట్టించేలా ప్రలోభపెడుతున్నారని తెలుస్తోంది. రోజువారీ కూలీలు, ఉద్యోగార్థులు, విద్యార్థులు కూడా ఈ బెట్టింగ్ వ్యసనానికి బానిసవుతున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది.

### ››› అప్పులు, వడ్డీలు కుటుంబాల్లో కలహాలు//

మొదట సరదాగా ప్రారంభమైన బెట్టింగ్ అలవాటు తర్వాత పెద్ద సమస్యగా మారుతోంది. గెలుస్తామనే ఆశతో యువత అప్పులు చేసి మరీ



బెట్టింగ్‌లలో పాల్గొంటున్నారు. కొందరు ఫైనాన్స్ యాప్స్ ద్వారా అప్పులు తీసుకుని డబ్బులు కోల్పోతుండగా మరికొందరు కుటుంబ సభ్యులకు తెలియకుండా బంగారం తాకట్టు పెట్టే పరిస్థితులు కూడా ఎదురవుతున్నాయని సమాచారం.

దీంతో కుటుంబాల్లో గొడవలు, మానసిక ఒత్తిడులు పెరుగుతున్నాయి. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారు. రాత్రంతా మొబైల్‌తోనే ఉంటున్నారు. డబ్బుల కోసం ఒత్తిడి చేస్తున్నారు. అంటూ పలువురు తల్లిదండ్రులు వాపోతున్నారు.

### ››› ఆత్మహత్యల భయం వెంటాడుతోంది

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో బెట్టింగ్‌ల కారణంగా యువకులు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు ఇప్పటికే వెలుగుచూశాయి. ఇదే పరిస్థితి కొనసాగితే మరిన్ని కుటుంబాలు విషాదంలో మునిగే ప్రమాదం ఉందని సామాజికవేత్తలు హెచ్చరిస్తున్నారు. త్వరగా డబ్బు సంపాదించాలి. అనే ఆశ యువతను ప్రమాదకర మార్గంలో నడిపిస్తోందని చెబుతున్నారు.

### ››› పోలీసుల నిఘా అవసరం



పాల్వంచ పట్టణంలో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా యువతను టార్గెట్ చేస్తున్న సోషల్ మీడియా గ్రూపులు, బెట్టింగ్ యాప్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### ››› మానసిక నిపుణుల సూచనలు

మానసిక నిపుణుల అభిప్రాయం ప్రకారం బెట్టింగ్ ఒక వ్యసనం. మొదట సరదాగా అనిపించినా తర్వాత అది మానసిక బలహీనతగా మారి డిప్రెషన్‌కు దారితీస్తుంది. ఓటమి తర్వాత తిరిగి గెలవాలనే ఆలోచనతో మరింత డబ్బు పెట్టడం వల్ల పరిస్థితి మరింత విషమిస్తుందని చెబుతున్నారు.

### ››› సమాజం కలిసి ముందుకు రావాలి

ఐపీఎల్ క్రికెట్‌ను క్రీడాస్ఫూర్తితో ఆస్వాదించాల్సిన యువత బెట్టింగ్‌లతో జీవితాలను పణంగా పెడుతున్నారు. ఈ పరిస్థితిని అరికట్టేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులు, సామాజిక సంస్థలు కలిసి యువతకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఆటను వినోదంగా చూడాలి. జీవితాన్ని పందెంగా మార్చకూడదు అనే సందేశం ప్రతి ఇంటికి చేరాల్సిన సమయం ఆసన్నమైంది.

# ఉచిత కంప్యూటర్ శిక్షణ శిబిరం ప్రారంభం





**చర్ల, ఏప్రిల్ 26 (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో స్థానిక శ్రీ దేవభక్తుని రాహుల్ విజ్ఞాన్ విద్యాలయంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వేసవి కంప్యూటర్ శిక్షణ శిబిరం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చర్ల మండల విద్యాశాఖ అధికారి (ఏం ఈ ఓ ) పరిటాల వెంకట రమణ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ తరగతులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతి విద్యార్థికి అత్యవసరమని ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఈ ఉచిత అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సాంకేతిక రంగంలో ముందంజ వేయాలని సూచించారు.మండలంలోని పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎటువంటి ఫీజు లేకుండా ఆధునిక కంప్యూటర్ కోర్సులు అందిస్తున్న విద్యాలయ ఛైర్మన్ డాక్టర్ డి.ఎన్.కుమార్‌ను ఆయన అభినందించారు. విద్యార్థులకు విజ్ఞానం పంచాలనే ఆయన సంకల్పం ఆదర్శనీయమని కొనియాడారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ఎం.వి.ఎల్.నరసింహారావు కార్యక్రమ వివరాలను వెల్లడిస్తూ ఈ శిబిరంలో 4వ తరగతి నుండి 8వ తరగతి వరకు విద్యార్థులకు కంప్యూటర్ బేసిక్స్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ వినియోగం తో పాటు ఆధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ ఐ ) పై మే 19 వరకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వర్మ రాజు, గురజాల రామారావు, బోసు బాబు, క్రాంతి కుమార్, ఉస్మాన్, సునీత, సంగీత, రాజా, లావణ్య, ఆనంద్, మాధురి, ప్రముఖులు మాతా రమణయ్య, గుమ్మడి భారతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మే 11 నుంచి అఖిల భారత ఐక్య రైతు సంఘం జాతీయ మహాసభలు

- పోస్టర్‌ను ఆవిష్కరించిన రైతు సంఘం నేత కె. రంగారెడ్డి




**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 26 , ప్రజాజ్యోతి,** అఖిల భారత ఐక్య రైతు సంఘం జాతీయ ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జాతీయ కన్వీనర్ కె. రంగారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం భద్రాచలంలోని సీపీఎంఎల్ మాస్టర్ పార్టీ కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ.. మే 11, 12, 13 తేదీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణంలో ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభం, రైతుల సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యచరణను ఈ సభల్లో ఖరారు చేస్తామన్నారు. ఈ మహాసభలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ వ్యవసాయ శాఖ మంత్రి వడ్డే భనాద్రీశ్వరరావుతో పాటు వివిధ రాష్ట్రాల రైతు నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. మే 11న ఇల్లందులో భారీ రైతు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎంఎల్ జిల్లా నాయకురాలు కెచ్చెల కల్పన, నాయకులు సాయన్న, మునిగేల శివ ప్రశాంత్, భాస్కర్, మహేశ్వరి, కుమారి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రిలో అంగరంగ వైభవంగా గోదావరి నది హారతి

- శ్రీరామ నామస్మరణతో మార్మోగిన గోదావరి తీరం
- పాల్గొన్న సబ్ కలెక్టర్ కుటుంబ సభ్యులు

**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 26 ప్రజాజ్యోతి,** శ్రీ సీతారామచంద్రస్వామి కొలువై ఉన్న పుణ్యక్షేత్రం భద్రాచలంలో ఆదివారం సాయంత్రం గోదావరి నదీ హారతి కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. పరాభవ నామ సంవత్సరం వైశాఖ శుక్ల దశమిని పురస్కరించుకుని భద్రాద్రి బ్రాహ్మణ పురోహిత సంఘం ఆధ్వర్యంలో కరకట్ట వద్ద నిర్వహించిన ఈ వేడుక భక్తుల జైజయధ్వానాలు, వేద మంత్రోచ్ఛారణల మధ్య ఆధ్యాత్మిక శోభతో సాగింది.ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త రామ వజ్జల రవికుమార్ మాట్లాడుతూ.. లోక కల్యాణార్థం ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఈ నదీ హారతి భక్తులకు కన్నుల పండువగా నిలుస్తోందన్నారు. సాయంత్రం 6 గంటలకు చిన్నారుల భజన కార్యక్రమాలు, భక్తి గీతాలతో కార్యక్రమం ప్రారంభమైంది. పురోహితులు ముందుగా నదీ హారతి విశిష్టతను భక్తులకు వివరించి, గణపతి పూజ నిర్వహించారు. అనంతరం 'జైశ్రీరామ్' ఆకృతిలో 108 ప్రమిదలతో ఏర్పాటు చేసిన దీపోత్సవం భక్తులను మంత్రముగ్ధులను చేసింది.**శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు** శ్రీరామ అష్టోత్తర శతనామావళిని పఠిస్తూ గోదావరి మాతకు అష్టోత్తర శతనామార్చన చేశారు. భక్తులందరూ 'ఓం శ్రీ రామాయ నమః' అంటూ రామనామ భజనలో తరించారు. తొలుత సీతారామచంద్రస్వామి వారికి 12 సార్లు, ఆ తర్వాత గోదావరి నదికి 21 సార్లు హారతులు సమర్పించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో భద్రాచలం సబ్ కలెక్టర్ సతీమణి, వారి కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.**ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు** నదీ హారతికి ముందు బూర్గంపాడు మండలం సారపాక శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థిని విహారిక ప్రదర్శించిన క్లాసికల్ డాన్స్ వీక్షకులను ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు పులిహోర, శనగలను ప్రసాదంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి పూజా సామాగ్రిని భద్రాచలంలోని శ్రీ రాఘవేంద్ర బట్టల షాపు వారు అందజేశారు.ఈ వేడుకలో వీఆర్వో వరలక్ష్మి, పురోహితులు సురేష్ వర్మ, పవన్ కుమార్ శర్మ, కారంబరీ కృష్ణ శర్మ, రామాచార్యులు, ఫణి కుమార్ శర్మ, సత్య ప్రసాద్ శర్మ, తేజ శర్మతో పాటు పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, భద్రాద్రి కా మహారాజు ప్రతినిధులు మరియు దేశ విదేశాల నుండి వచ్చిన భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.





## మేడేను జయప్రదం చేయండి

- చికాగో అమరవీరుల పోరాట స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకై పోరాడుదాం
- టియుసిఐ జిల్లా అధ్యక్షులు ఆర్.మధుసూదన్ రెడ్డి




**మణుగూరు, ఏప్రిల్ 26, (ప్రజాజ్యోతి ):** మేడేను జయప్రదం చేయాలని, చికాగో అమరవీరుల పోరాట స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకై పోరాడాలని టియుసిఐ జిల్లా అధ్యక్షులు ఆర్.మధుసూదన్ రెడ్డి కార్మికులను కోరారు. ఆదివారం మేడేకు సంబంధించిన పోస్టర్లను స్థానిక టియుసిఐ కార్యాలయంలోఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి రక్త తర్పణ చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకు వచ్చిందని అన్నారు. ఈ లేబర్ కోడ్స్ తీసుకురావడంలో ముఖ్య ఉద్దేశం కార్మికుల శ్రమను కారు చౌకగా కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడానికే అని మండిపడ్డారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దు కొరకు పోరాడవలసిన బాధ్యత కార్మిక వర్గంపై ఉందన్నారు. అమెరికా సామ్రాజ్యవాదం దురాక్రమణ దాడులు, యుద్ధ భారాలు ప్రపంచ కార్మిక వర్గం పై, ప్రజలపై పడుతుందన్నారు. చికాగో అమరవీరుల పోరాట స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకై వ్యతిరేకంగా పోరాడాలని కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో పి.సంజీవరెడ్డి, బత్తుల.వెంకటేశ్వర్లు, వి.జానయ్య, సతీష్, వంశీ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సమ్మర్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం




**ఇల్లందు, ఏప్రిల్ 26, ప్రజాజ్యోతి:**తెలంగాణ రైసింగ్‌లో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్పోర్ట్స్ యూత్ అథారిటీ ఆధ్వర్యంలో ఇల్లందు సింగరేణి గోల్స్ అండ్ రన్స్ గ్రౌండ్‌లో 41 రోజుల గవర్నమెంట్ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను 22వ వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్, కోల్ ఇండియా ఫుట్‌బాల్ ప్లేయర్ జి. శ్రీనివాస్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తుందని, విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిస్తే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని తెలిపారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుని సెల్ ఫోన్‌లకు పరిమితం కాకుండా మైదానాల్లో శిక్షణ పొందాలని, క్రమశిక్షణతో సాధన చేస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. ఈ మైదానంలో శిక్షణ పొందిన అనేక మంది యువకులు స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించి జీవితంలో స్థిరపడ్డారని, ఇలాంటి అవకాశాలను ప్రతి విద్యార్థి, యువత వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 23వ మాజీ కౌన్సిలర్ కుమ్మరి రవీందర్, ఫుట్ బాల్ కోచ్ చలమల రవిచంద్ర, సంతోష్ ట్రోఫీ క్రీడాకారుడు కాకేటి రాకేష్, క్రీడాకారులు కీర్తి రవి, యాసిన్, మాదాసు సుమన్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందు ప్రెస్ క్లబ్ కార్డులను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



ఇల్లందు, ఏప్రిల్ 26, ప్రజాజ్యోతి: ఇటీవల నూతనంగా ఎన్నికైన ఇల్లందు ప్రెస్ క్లబ్ కు సంబంధించిన కార్డులను ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆవిష్కరించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులకు మాటేటి మధు, తాడూరి శేఖర్ ల తోపాటు కమిటీ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారదిగా ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసే విషయంలో పాత్రికేయుల పాత్ర ఎంతో ఉందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు మండల, పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధికి అవసరమైన వివరాలను ప్రజా ప్రతినిధులు అధికారులుకు దృష్టికి తీసుకెళ్లి ఒక పరిష్కార మార్గం చూపడంలో పాత్రికేయుల పనితీరు వెలకట్టలేనిది కొనియాడారు. నిజాలను వెలికితీస్తూ ప్రజల మన్ననలు పొందుతూ భవిష్యత్తులో ప్రభుత్వానికి ప్రజలకు సంధానకర్తగా పాత్రికేయులు పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు గుర్రం రాజేష్, బత్తుల రాధాకృష్ణ, గోరిశెట్టి విజ్ఞాన్, కల్లేపల్లి రవి, సరికొండ ప్రసాద్, అబ్బూరి డానియల్, చాంద్ పాషా, దాస్యం సురేంద్రబాబు, ధారావత్ వీరన్న, గంట మహేందర్ రెడ్డి, శివ శంకర్, కాకటి సతీష్, వేమూరి రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, మాజీ వైస్ ఎంపీపీ మండల రాము, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు భోళ్ల సూర్యం, ఐఎన్టీయూసీ నాయకుడు గోచికొండ సత్యనారాయణ, సర్పంచులు పాయం స్వాతి, వల్లాల మంగమ్మ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## హిందూ సాంప్రదాయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలి

- శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి



**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 26,(ప్రజా జ్యోతి)** పాల్వంచ పట్టణం కాంట్రాక్టర్స్ కాలనికి చెందిన రోజా రమణి గృహానికి ఆదివారం చిన్న జీయర్ స్వామి విచ్చేసారు.ఈ సందర్భంగా ఆయనకు వికాస తరంగిణి జిల్లా అధ్యక్షురాలు రోజా రమణి మంగళ హారతులతో ఘనంగా స్వాగతం పలికారు, అనంతరం స్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు, అనంతరం చిన్న జీయర్ స్వామిని చూసేందుకు వచ్చిన భక్తులందరికీ చిన్న జీయర్ స్వామి మంగళ శాసనాలు తో ఆశీర్వాదాలు అందించారు. ఈ సందర్భంగా చిన్న జీయర్ మాట్లాడుతూ హిందూ సాంప్రదాయాలను గౌరవించి తప్పకుండా ఆచరించాలని ఉద్బోధించారు.ఈ కార్యక్రమం లో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఐఎల్పీఏ జాతీయ కౌన్సిల్‌కు సుంకర భానుప్రియ ఏకగ్రీవ ఎన్నిక

- కొత్తగూడెం న్యాయవాదికి జాతీయ స్థాయిలో గౌరవం



**కొత్తగూడెం, ఏప్రిల్ 26 (ప్రజాజ్యోతి)** ఇండియన్ లీగల్ ప్రోఫేషనల్స్ అసోసియేషన్ (ఐఎల్పీఏ) జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా కొత్తగూడెం బార్ అసోసియేషన్‌కు చెందిన మహిళా న్యాయవాది సుంకర భానుప్రియ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నాగపూర్‌లో జరిగిన జాతీయ మహాసభలో ఐఎల్పీఏ జాతీయ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షురాలిగా సుజాత చౌదంతే జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.జే. సాంసన్ ఎంపిక కాగా జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా సుంకర భానుప్రియకు అవకాశం లభించింది. జ్యోతిరావు పూలే, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆలోచనలతో ఆవిర్భవించిన ఐఎల్పీఏ న్యాయవాదుల సంక్షేమం, అభ్యున్నతి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తోందని భానుప్రియ తెలిపారు. సమాజంలో అణగారిన వర్గాలకు రాజ్యాంగ ఫలాలు అందేలా చేయడం, సమానత్వం, సమాన అవకాశాల కోసం పనిచేయడం సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు. బామ్‌సెఫ్‌కు అనుబంధంగా పనిచేస్తున్న ఈ సంస్థ పే బ్యాక్ టు సొసైటీ సిద్ధాంతంతో ముందుకు సాగుతోందని వివరించారు. సమసమాజ నిర్మాణం కోసం న్యాయవాదులు ఐఎల్పీఏలో సభ్యులుగా చేరాలని ఆమె పిలుపునిచ్చారు. భానుప్రియ ఎంపికతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఖ్యాతి జాతీయ స్థాయిలో మరింతగా నిలిచిందని ఐఎల్పీఏ తెలంగాణ రాష్ట్ర నాయకులు జనపరెడ్డి గోపీకృష్ణ, మారపాక రమేష్, మహమ్మద్ సాదిక్ పాషా, డి. సామంత్, యెర్రా కామేష్, యెర్రాపాటి కృష్ణ హర్షం వ్యక్తం చేశారు.

## మాజీ కౌన్సిలర్ పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

**ఇల్లందు, ఏప్రిల్ 26, ప్రజాజ్యోతి:** ఇల్లందు మున్సిపల్ పరిధిలోని ఓ మాజీ వార్డు కౌన్సిలర్ ఎన్నికల సమయంలో దళితులపై దాడులు, దూషణలు, బెదిరింపులకు పాల్పడిన విషయంపై సదరు మాజీ వార్డు కౌన్సిలర్ పై వెంటనే అట్రాసిటీ కేసు నమోదు చేయాలని తెలంగాణ మాదిగ మహిళా కమిటీ ఇల్లందు నియోజకవర్గ అధ్యక్షురాలు వంగూరి దేవమ్మ కోరారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో రాత్రి సమయంలో కొంతమంది దళితులు, అన్నగారిన వర్గాల నాయకులను లక్ష్యంగా చేసుకొని అసభ్య పదజాలాలతో దూషించడం జరిగిందని తెలిపారు. అదేరోజు ఇల్లందు పోలీస్ స్టేషన్ లో, మున్సిపల్ ఎన్నికల ప్రధాన అధికారికి ఈమెయిల్ ద్వారా, జిల్లా ఉన్నతాధికారులకు ఆధారలతో ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే మాజీ కౌన్సిలర్ పై కేసు నమోదు చేయాలని కోరారు.

# 25 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- అన్నపురెడ్డిపల్లిలో 1999-2000 పదో తరగతి విద్యార్థుల కలయిక
- గురువులకు సన్మానం.. తీపి జ్ఞాపకాలతో ఆనంద వేడుక
- పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకుని ఉత్సాహంగా మిత్రుల సందడి



**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 26, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో 1999–2000 పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఆత్మీయ వాతావరణంలో నిర్వహించారు. 25 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై ఆనందంగా పాల్గొన్నారు. చాలా కాలం తర్వాత ఒక్కచోట చేరిన మిత్రులు పరస్పరం ఆప్యాయంగా పలకరించుకుని సంతోషాన్ని పంచుకున్నారు. పాఠశాల రోజుల్లో కలిసి చదువుకున్న తరగతి గదులు, గురువుల బోధనలు, ఆటపాటలు, స్నేహబంధాలను గుర్తుచేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. ఒకరినొకరు చూసుకుని ఆనందంతో పాత రోజుల జ్ఞాపకాల్లో మునిగిపోయారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ప్రత్యేకంగా ఆహ్వానించి శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో మరింత ఉన్నత స్థాయికి చేరాలని, పరస్పర సహకారంతో ముందుకు సాగాలని, సమాజానికి ఉపయోగపడే విధంగా జీవించాలని సూచించారు. విద్యార్థుల అభివృద్ధిని చూసి గురువులు హర్షం వ్యక్తం చేశారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు సాగిన ఈ కార్యక్రమంలో సమూహ చిత్రాలు, వినోద కార్యక్రమాలు, భోజన విందుతో సందడి నెలకొంది. పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని వేడుకను మరింత ప్రత్యేకంగా మార్చారు. ఈ సమ్మేళనం ద్వారా పాత స్నేహబంధాలు మరింత బలపడినట్లు పాల్గొన్న వారు తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన నిర్వాహకులను పూర్వ విద్యార్థులు అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సమ్మేళనాలు నిర్వహించాలని నిర్ణయించారు.





## ఐ డి ఓ సి కార్యాలయంలో ఘనంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు





**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 26,(ప్రజా జ్యోతి)** స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలోని ఐ డి ఓ సి కార్యాలయ సమావేశ మందిరంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలను జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ పాల్గొని కన్యకా పరమేశ్వరి చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం ఆయన మాట్లాడారు, అహింస మార్గంలో ధర్మాన్ని రక్షించిన గొప్ప వీరనారి శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారిని కొనియాడారు ,ఆమె చూపిన శాంతి త్యాగ నిరతి నేటి యువతకు స్ఫూర్తినిస్తుందని అన్నారు, సమాజ హితం కోసం అమ్మవారు చేసిన ఆత్మబలిదానం చారిత్రాత్మకంగా ఉంటుందన్నారు, ప్రతి ఒక్కరు ఆమె ఆశయాలను స్మరించుకోవాలని కోరారు, ఈ కార్యక్రమంలో డి ఐ ఈ ఓ వెంకటేశ్వర్లు, ఈ డి ఎస్ సి కార్పొరేషన్ ఉపేందర్, లేబర్ ఆఫీసర్ షరీవుద్దీన్, డిఎం అండ్ హెచ్ ఓ తుకారం రాథోడ్, జిల్లా క్రీడల శాఖ సిబ్బంది, కలెక్టరేట్ ఉద్యోగుల తో పాటు ఆర్యవైశ్య ప్రముఖులు దారా నాగేష్, దారా రమేష్, కమ్మంపాటి రమేష్, కొదుమూరి శ్రీనివాస్, కొదుమూరి సురేష్ జూలూరి ఆనంద్ పాల్గొన్నారు

## ఎరువుల దుకాణాల బంద్ కు పిలుపు

- డీలర్ల సమస్యల పరిష్కారం కోసం 27న పినపాక మండలంలో ఎరువుల షాపులు మూసివేత.



**పినపాక, ఏప్రిల్ 26(ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, &, సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫెర్టిలైజర్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపు మేరకు పినపాక మండల వ్యాప్తంగా ఈ నెల 27వ తేదీ (సోమవారం) ఒకరోజు పాటు ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాలను బంద్ చేయాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని మండల ఫెర్టిలైజర్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.వి. రాంబాబు తెలిపారు. డీలర్లపై పెరుగుతున్న భారం, అన్యాయ విధానాలపై నిరసనగా ఈ బంద్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వీరి ప్రధాన డిమాండ్లు: ఎరువుల తయారీ కంపెనీలు డీలర్లకు ఎటువంటి రవాణా లేదా కిరాయి భారాలు లేకుండా సరఫరా చేయాలని, అలాగే లింక్ ప్రొడక్ట్స్ లేకుండా ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. డీలర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేసే అవకాశముందని హెచ్చరించారు. రైతులు ఈ బంద్ ను గమనించి అవసరమైన ఎరువులను ముందుగానే సేకరించుకోవాలని సూచించారు.

# హిందూ శక్తి ప్రదర్శనగా మారిన సమ్మేళనం

- హిందూ గర్జనతో హోరెత్తిన కొత్తగూడెం
- ప్రకాశం స్టేడియంలో ఐక్య హిందూ మహాస మ్మేళనం
- వేలాదిగా తరలి వచ్చిన భక్తజనం
- జై శ్రీరామ్ నినాదా లతో మార్మోగిన స్టేడియం
- చిన్నారుల నృత్యాలు, అన్నమయ్య కీర్తనలు, భరతనాట్యం ప్రత్యేక ఆకర్షణ









**కొత్తగూడెం, ఏప్రిల్ 26 (ప్రజాజ్యోతి)** పట్టణం మొత్తాన్ని ఆధ్యాత్మిక, సాంస్కృతిక ఉత్సాహంతో ముంచెత్తుతూ నిర్వహించిన హిందూ సమ్మేళనం కార్యక్రమం భారీ విజయాన్ని సాధించింది. కొత్తగూడెం ప్రకాశం స్టేడియం వేదికగా జరిగిన ఈ మహాసమ్మేళనం ప్రతి హిందువు తలెత్తుకునేలా ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. స్టేడియం మొత్తం భక్తి నినాదాలతో మార్మోగిపోగా పండుగ వాతావరణం నెలకొంది. మొట్టమొదటి సారిగా నిర్వహించిన ఈ హిందూ సమ్మేళనం కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా హిందూ బంధువులు తరలివచ్చి కార్యక్రమాన్ని ఘనవిజయంగా నిలిపారు. శ్రీరామ్.. జై శ్రీరామ్ నామస్మరణతో స్టేడియం మార్మోగి పాల్గొన్న ప్రతి ఒక్కరిని ఆధ్యాత్మిక భావనలో ముంచెత్తింది. జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులు హిందూ సమాజ ఐక్యతపై ప్రాముఖ్యతను వివరించారు. యుగయుగాలుగా పూర్వికులు చేసిన త్యాగాల ఫలితంగా ఈ పవిత్ర వేదభూమి మనకు దక్కిందని భావితరాల భవిష్యత్తు కోసం అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం అనేక మహానుభావులు చేసిన త్యాగాలను గుర్తుచేస్తూ సమాజం ఐక్యంగా ఉండాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇస్కాన్ హైదరాబాద్‌కు చెందిన మోటివేషన్ స్పీకర్ కీర్తి రాజదాస్ ప్రభుజీ, విశిష్ట అతిథిగా భద్రాచలం అరుణాచల స్వామీజీ, ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత ప్రచార ప్రముఖ్ లింగం శ్రీధర్, వనవాసి కళ్యాణ పరిషత్‌కు చెందిన శ్రీమతి పెద్దాడ ఆశాలత తదితరులు హాజరయ్యారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రూపకల్పన చేసిన రాజ్యాంగం దేశ ప్రజలందరినీ ఒకే తాటిపై నిలబెట్టిందని గుర్తు చేశారు. విజయవంతం అయిన హిందూ సమ్మేళన ఉత్సవ సమితి అధ్యక్షులు పి. వీరవర్ధన్ రావు, కార్యదర్శి లట్టి జగన్మోహన్‌తో పాటు పల్లపోతు వాసు, కంభంపాటి రమేష్, భూపతి అప్పారావు, బండి భాస్కర్, వారాహి సురేష్, దారా రమేష్, కృష్ణమూర్తి, గురుస్వామి, అప్పారి లక్ష్మణ్ తదితరులు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు.

- ♦ **ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి**

ఈ సమ్మేళనంలో చిన్నారుల నృత్యాలు, భరతనాట్యం, సంప్రదాయ కళాప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అన్నమయ్య కీర్తనలు, భక్తి గీతాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన నృత్యకారులు తమ ప్రతిభను ప్రదర్శించి విశేష ప్రశంసలు అందుకున్నారు. హనుమాన్ సేవా సమితి బృందం నిర్వహించిన హనుమాన్ చాలీసా పారాయణం, భాస్కర్ బృందం గాన భక్తి గీతాలు, శ్రీమతి సీతా ప్రసాద్ శిష్యబృందం నృత్య ప్రదర్శనలు కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చాయి.

- ♦ **హిందూ సమ్మేళనం ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు**

సమ్మేళనం సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించబడటం విశేషం. భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి కార్యక్రమాన్ని క్రమబద్ధంగా నిర్వహించారు. కార్యక్రమంలో వందే మాతరం, భారత్ మాతాకీ జై నినాదాలతో స్టేడియం మార్మోగింది. హిందూ సమాజ ఐక్యతకు ఈ సమ్మేళనం ఒక నూతన దిశగా నిలిచిందని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.





## వరుస దొంగతనాలకు చెక్.. ఇద్దరు అరెస్ట్

- నిందితుల నుంచి వెండి వస్తువులు, బైక్ స్వాధీనం
- సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో పట్టుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన సిఐ నాగరాజు




**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 26 ప్రజాజ్యోతి ,** గత రెండు నెలలుగా భద్రాచలం పట్టణం మరియు బూర్గంపాడు మండల పరిధిలో వరుస దొంగతనాలతో హడలెత్తిస్తున్న ఇద్దరు కిలాడీ దొంగలను భద్రాచలం పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి భారీగా వెండి వస్తువులతో పాటు ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ నాగరాజు కేసు వివరాలను వెల్లడించారు. పట్టణంలో పెరుగుతున్న చోరీల నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు నిఘా తీవ్రం చేశారు. సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాల సాయంతో దర్యాప్తు కొనసాగిస్తుండగా.. శనివారం రాత్రి కూనవరం రోడ్డులోని వీరభద్ర ఫంక్షన్ హాల్ సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి తప్పించుకునే ప్రయత్నం చేయగా, ఎస్ఐ శ్యామ్ ప్రసాద్ తన సిబ్బందితో కలిసి వారిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితులు భద్రాచలం పట్టణంతో పాటు బూర్గంపాడు మండల పరిధిలో పలు చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. పట్టుబడిన వారిని భద్రాచలానికి చెందిన నిందితులుగా గుర్తించి, వారి నుంచి దొంగిలించిన వెండి సామాగ్రిని రికవరీ చేశారు. నిందితులను ఆదివారం న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు వారికి రిమాండ్ విధించిందని సీఐ తెలిపారు. నేరాలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలనీ సిఐ నాగరాజు తెలిపారు. ఈ దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ శ్యామ్ ప్రసాద్ మరియు పోలీస్ సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

## నిరుద్యోగులకు మే 4న జాబ్ మేళా




**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 26,(ప్రజా జ్యోతి)** ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన నిరుద్యోగులకు మే 4 తేదీ న జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జిల్లా యువజన క్రీడల శాఖ శాఖ అధికారి మహీధర్ రెడ్డి తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఇంటర్మీడియట్ నుండి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు విద్యార్హత కలిగిన యువతకు మార్కెటింగ్ ఫైనాన్స్, బ్యాంకింగ్, హెల్త్, ఐటి, బిజినెస్ సర్వీసెస్, కస్టమర్ సర్వీసెస్, హాస్పిట లాటి ,డిజిటల్ మీడియా, లాజిస్టిక్స్, తదితర రంగాలలో ఉపాధి కల్పించేందుకు జిల్లా యువజన క్రీడల ఇండస్ట్రీస్ కామర్స్ డిపార్ట్మెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ డిపార్ట్మెంట్ సారథ్యంలో సుమారు 50 కంపెనీలు 10 పాత జిల్లాల హెడ్ క్వార్టర్ లో అనగా ఉమ్మడి ఖమ్మం జిల్లా లో మే 4న జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు అర్హత కలిగిన నిరుద్యోగులు ఆన్లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు, పూర్తి వివరాలకు ఐ డి ఓ సి కార్యాలయం రూమ్ నెంబర్ 19 సంప్రదించాలని, అదేవిధంగా9849913068 నెంబర్కు కాల్ చేసి మరిన్ని వివరాలను తెలుసుకోవచ్చని వివరించారు